క్లుప్తంగా

వేంకటేశ్వరస్వామికి పంచామృతాభిషేకాలు



పంచామృత కలశాలకు ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

తుని రూరల్: ఎస్.అన్నవరంలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వర స్వామి వారికి గురువారం పంచామృతాభిషేకాలు నిర్వహించారు. స్వామివారి జన్మనక్షత్రం శ్రవణం సందర్భంగా పాత సంచుల వర్తక సంఘం, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. 108 వెండి కలశాలలో ఉంచిన పంచామృతాలకు భక్తులు, ధర్మకర్తల సమక్షంలో అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అర్చకులు, భక్తులు, ధర్మకర్తలు పంచామృతాలను స్వామివారికి అభిషేకించారు. అనంతరం స్వామివారికి విశేషాలంకరణ చేసి భక్తులకు దర్శనాలు కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కోర్టు నిర్మాణ పనులు వేగవంతం చేయాలని వినతి



జిల్లా న్యాయమూర్తి సునీతను కలిసిన తుని బార్ అసోసియేషన్ సభ్యులు

తుని: స్థానిక బ్యాంకుకాలనీలో కోర్టు భవన సముదాయం నిర్మాణ పనులను వేగవంతం చేయాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సలుగు కృష్ణశేఖర్ కోరారు. ఈ మేరకు రాజమంహేంద్రవరంలో జిల్లా జడ్జి గంధం సునీతకు వినతి పత్రం సమర్పించినట్టు గురువారం ఆయన తెలిపారు. బార్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు న్యాయమూర్తి సునీతను మర్యాద పూర్వకంగా కలిశారు. తునిలో సబ్ కోర్టు ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు. బార్ అసోసియేషన్ ప్రతిపాదనలకు న్యాయమూర్తి సానుకూలంగా స్పందించారన్నారు. నూతనంగా ఎన్నికైన కమిటీను న్యాయమూర్తి అభినందించారు.

ఎస్ఈబీ దాడుల్లో నలుగురి అరెస్టు

ప్రత్తిపాడు: స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్–ఎస్ఈబీ) పరిధిలో గురువారం నిర్వహించిన దాడుల్లో నలుగురు నిందితులను అరెస్టు చేసినట్టు స్థానిక సెబ్ సీఐ ఎల్. చిరంజీవి తెలిపారు. ప్రత్తిపాడు మండలం ఒమ్మంగిలో విశ్వనాథ బాబ్జిని అదుపులోకి తీసుకుని, అతని నుంచి 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. వివిధ కేసుల్లో పరారీలో ఉన్న మండలంలోని పెద్దిపాలెం గ్రామానికి చెందిన కేతా లోవరాజు, బొండలపు రమణ, దుంగా రాజులను అరెస్టు చేశామన్నారు. వీరిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ చిరంజీవి తెలిపారు.

నాటక ప్రదర్శన వాల్ పోస్టర్ ఆవిష్కరణ



ప్రత్తిపాడులో వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

ప్రత్తిపాడు: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 133వ జయంతిని పురస్కరించుకుని ప్రత్తిపాడు ఉషోదయ పార్కు వద్ద ఈ నెల 10వ తేదీ రాత్రి 'అంబేడ్కర్ జీవితం–కృషి' నృత్యరూప నాటక ప్రదర్శన ఏర్పాటు చేసినట్టు సీఐటీయూ మండల ప్రధాన కార్యదర్శి రొంగల ఈశ్వరరావు తెలిపారు. ఈ నాటక ప్రదర్శనను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ మేరకు స్థానిక అంబేడ్కర్ కళామందిర్ వద్ద గురువారం సాయంత్రం నాటిక వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఅర్పీల సంఘ నాయకుడు ఇ. రాంజీప్రసాద్, బార్ అసోసియేషన్ కార్యదర్శి బొంగుకూరి మధుబాబు, డీబీఎఫ్ నాయకుడు మూరా చిన్నిబాబు, అంగన్‌వాడీ వర్కర్ల హెల్పర్ల సంఘ నాయకురాలు లక్ష్మి పాల్గొన్నారు.

బీజేపీలోకి కంబాల శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న కంబాల శ్రీనివాసరావు

గోకవరం: గ్రామానికి చెందిన ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త, విశ్వహిందూ పరిషత్ రామసేన వ్యవస్థాపక అధ్యక్షుడు కంబాల శ్రీనివాస్‌రావు బీజేపీలో చేరుతున్నట్టు ప్రకటించారు. గోకవరంలో గురువారం సాయంత్రం కంబాల శ్రీనివాసరావును బీజేపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ కలిసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న తనకు బీజేపీ నుంచి ఆహ్వానం రావడాన్ని స్వాగతిస్తున్నట్టు చెప్పారు. త్వరలోనే బీజేపీలో చేరి పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టా మంగరాజు, నియోజకవర్గ కన్వీనర్ దాట్ల కృష్ణవర్మ, మండలాధ్యక్షుడు సత్తి వెంకటరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి ఇనకోటి బాపన్నదొర, ఉపాధ్యక్షుడు బత్తుల వెంకన్నబాబు, జిల్లా కోకన్వీనర్ కోన సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ సారథికి పట్టం కట్టండి



చింతలూరులో ఎన్నికల ప్రచారం చేస్తున్న చలమలశెట్టి సునీల్, వరుపుల సుబ్బారావు, ఎమ్మెల్సీ అనంతబాబు

- వైఎస్సార్ సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు చలమలశెట్టి సునీల్, వరుపుల సుబ్బారావు
- వాకపల్లి, చింతలూరు గ్రామాల్లో ఎమ్మెల్సీ అనంతబాబుతో కలిసి ఎన్నికల ప్రచారం

ప్రత్తిపాడు రూరల్: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వచ్చే ఎన్నికల్లో పట్టం కట్టాలని వైఎస్సార్ సీపీ కాకినాడ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్, ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు పిలుపునిచ్చారు. మండలంలోని వాకపల్లి, చింతలూరు గ్రామాల్లో ఎమ్మెల్సీ అనంత ఉదయ్‌భాస్కర్‌తో కలిసి గురువారం వారు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అవ్వాతాతలపై చంద్రబాబు, పవన్‌కల్యాణ్ కక్షగట్టి ఇంటికి పింఛను రాకుండా అడ్డుకున్నారన్నారు. ఇంటికే సంక్షేమ పథకాలను అందించే వలంటీర్లపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడం దుర్మార్గమన్నారు. చంద్రబాబు అధికార దాహంతో చేప్పే అబద్ధాలను నమ్మవద్దన్నారు. సంక్షేమ పథకాలను ప్రజల ముంగిటకే చేర్చాలనే ఆలోచనతో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందుతున్నాయన్నారు. వచ్చే ఎన్నికల్లో ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తమను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి, వైఎస్సార్ జిల్లా ఉపాధ్యక్షుడు బెహరా దొరబాబు, పార్టీ మండల కన్వీనర్ రామిశెట్టి బులిరామకృష్ణ, జేసీఎస్ మండల కన్వీనర్ గొల్లపల్లి దొరబాబు, ఏఎంసీ వైస్ చైర్మన్ శేరు కృష్ణ, ఎంపీటీసీలు షర్మిల, ముప్పిడి ఏసుబాబు, పార్టీ నాయకులు కోడిబోయిన సింహాద్రి, రేఖా కృష్ణ, రేఖా సూరిబాబు, కర్రి మురళి, బొడ్డు సతీష్, దేసిరెడ్డి పాపారావు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

ఏలేశ్వరం: క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు సూచించారు. పార్టీ కాకినాడ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్, ఎమ్మెల్సీ అనంత ఉదయ్ భాస్కర్‌తో కలిసి గురువారం ప్రత్తిపాడు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గొల్లపల్లి కాశీవిశ్వనాథ్ ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వరుపుల మాట్లాడుతూ వైఎస్సార్ సీపీకి అన్నివర్గాల ప్రజల నుంచి అపూర్వ స్పందన వస్తోందన్నారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయం ఖాయమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి

- వైఎస్సార్ సీపీ జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం



గుమ్మళ్లదొడ్డిలో వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం



మల్లిశాలలో ప్రచారం చేస్తున్న తోట శ్రీనిధి

గోకవరం: రాష్ట్రంలో దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం విశేషంగా కృషి చేసిందని వైఎస్సార్ సీపీ జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం అన్నారు. మండలంలోని గుమ్మళ్లదొడ్డిలో స్వయంభూగా వెలసిన వల్మీక వేంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవుని ఆశీస్సులు, ప్రజలందరి దీవెనలతో మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందన్నారు. ప్రతిఒక్కరూ వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా, చలమలశెట్టి సునీల్‌ను ఎంపీగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సుంకర వీరబాబు, సమ్మెటి నాని, సొసైటీ చైర్మన్ దాసరి చినబాబు, జోనల్ ఇన్‌చార్జి గుల్లా ఏడుకొండలు, మాదిగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కండెల్లి పెద్దిరాజు, సర్పంచ్ బత్తుల శ్రీను, కొల్లాటి రామకృష్ణ, సోషల్ మీడియా నియోజకవర్గ కో కన్వీనర్ ఇజ్జిన కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న చేసిన మేలు మరవకండి

జగ్గంపేట: పేదల కష్టాలు తెలిసిన ముఖ్యమంత్రి జగనన్న అని, ఆయన చేసిన మేలును మరచిపోవద్దని వైఎస్సార్ సీపీ జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం కోడలు శ్రీనిధి అన్నారు. మండలంలోని మల్లిసాలలో గురువారం ఆమె ఇంటింటా ప్రచారం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా తోట నరసింహం, ఎంపీగా చలమలశెట్టి సునీల్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు అత్తులూరి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే అభివృద్ధి సాధ్యం



చలమలశెట్టి సునీల్, తోట నరసింహాన్ని గజమాలతో సత్కరిస్తున్న నాయకులు



పార్టీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న యువ నాయకుడు తోట రాంజీ

- వైఎస్సార్ సీపీ కాకినాడ ఎంపీ, జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థులు చలమలశెట్టి సునీల్, తోట నరసింహం
- వైఎస్సార్ సీపీలో 300 మంది చేరిక

గండేపల్లి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని వైఎస్సార్ సీపీ కాకినాడ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్, జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం పేర్కొన్నారు. మండలంలోని సూరంపాలెంలో జనసేన పార్టీ నాయకులు గుత్తుల గంగాధర్, బత్తిన శ్రీను, దుంగ నాగు, అడబాల దొరబాబు ఆధ్వర్యంలో సుమారు 300 మంది గురువారం వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి చలమలశెట్టి సునీల్, తోట నరసింహం కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సునీల్ మాట్లాడుతూ గ్రామానికి కోటి రూపాయల చొప్పున నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తామన్నారు. నిరుద్యోగ యువకులకు పరిశ్రమల నిర్మాణం ద్వారా ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. తోట నరసింహం మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు అండగా నిలవాలన్నారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తమను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఒమ్మి రఘురాం, పార్టీ నాయకుడు తోట రాంజీ, ఎంపీపీ చలగళ్ల దొరబాబు, పార్టీ మండల అధ్యక్షులు మద్దిపట్ల రామకృష్ణ, జేసీఎస్ మండల కన్వీనర్ తాళ్లూరి మధు, గ్రామ మాజీ సర్పంచ్ కుంచే చినబాబు పాల్గొన్నారు.

గంగవరాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతా

- వైఎస్సార్ సీపీ కాకినాడ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్



గంగవరం ధారమల్లికార్జున లొద్దిలో స్థానికులతో మాట్లాడుతున్న చలమలశెట్టి సునీల్

రౌతులపూడి: మండలంలోని గంగవరం ధారమల్లికార్జున లొద్ది ప్రాంతాన్ని ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతానని వైఎస్సార్ సీపీ కాకినాడ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్ అన్నారు. గంగవరం మల్లికార్జుని లొద్దిలో కొలువుదీరిన ధారమల్లికార్జుని స్వామి ఆలయాన్ని గురువారం పార్టీశ్రేణులతో కలసి ఆయన దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో తనను ఎంపీగా గెలిపిస్తే ధారమల్లికార్జుని లొద్దిప్రాంతాన్ని ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు పెంపొందిస్తానన్నారు. ఈ ప్రాంత్రంలో మినరల్ వాటర్ ట్యాంకు నిర్మాణానికి తన వంతు సహకారాన్ని అందిస్తానన్నారు. మండలంలో రాజవరం నుంచి గంగవరం, దిగువశివాడ వెళ్లే రహదారిని అభివృద్ధి చేస్తానని ఆయన స్థానికులకు హామీ ఇచ్చారు. అనంతరం ములగపూడి, రౌతులపూడి గ్రామాల్లో పలు ప్రైవేటు కార్యక్రమాలకు ఆయన హాజరయ్యారు. లింగంపర్తి సొసైటీ అధ్యక్షుడు వరుపుల సత్యసూరిబాబు, జెడ్పీటీసీ సభ్యుడు గొల్లు చిన దివాణం, పార్టీ నేత వాసిరెడ్డి జమీలు, డీసీసీబీ డైరెక్టర్ పులి మధు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోలుపర్తి తాతాజీ, సర్పంచులు సర్నం శ్రీను, రాపర్తి రామకృష్ణ, మాదాసు దొంగబాబు, వడ్లళ సత్యనారాయణ, సైపురెడ్డి కనకలక్ష్మీవెంకటరమణ పాల్గొన్నారు.

సీఎం జగన్‌ను మరోసారి ఆశీర్వదించండి

- మంత్రి రాజా తనయుడు శంకర్‌మల్లిక్
- టీజే నగరంలో ఎన్నికల ప్రచారం



టీజే నగరంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న శంకర్‌మల్లిక్, నాయకులు

కోటనందూరు: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా తనయుడు శంకర్‌మల్లిక్ విజ్ఞప్తి చేశారు. మండలంలోని టీజే నగరంలో గురువారం సాయంత్రం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి ఇంటిటికీ వెళ్లి గత నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం చేసిన మంచిని ప్రజలకు వివరించారు. జగన్‌ను మరోసారి సీఎంగా చేసుకుంటే అన్ని పథకాలు కొనసాగడంతో పాటు సమస్యలన్నింటికీ పరిష్కారం దొరుకుతుందన్నారు. తుని నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్న తన తండ్రి దాడిశెట్టి రాజాకు అత్యధిక మెజారిటీతో హ్యాట్రిక్ విజయాన్ని అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ లగుడు శ్రీనివాసు, సర్పంచ్ సుర్ల రాంబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు సుర్ల రాజు, నల్లమిల్లి గోవిందు, గిడుతూరి రాంబాబు, సుర్ల శ్రీను, సుర్ల నాగరమణ, జిగటాల కోటసత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



రౌతులపూడిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన అధికారులు

రౌతులపూడి: మండలంలోని రౌతులపూడి, పల్లపు చామవరం రైతు భరోసా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం మండల వ్యవసాయాధికారి రెడ్డి ఈశ్వరరావు, డీటీ పీపీవీ సత్యనారాయణ ప్రారంభించారు. రైతులు రబీలో సాగు చేసిన ధాన్యాన్ని ఈ కేంద్రాల్లో కనీస మద్దతు ధరకు విక్రయించుకోవాలని సూచించారు. సాధారణ రకం 75 కిలోల బస్తాకు రూ.1637, గ్రేడ్ ఏ రకం 75 కిలోల బస్తాకు రూ.1652గా ప్రభుత్వం మద్దతు ధర నిర్ణయించిందని చెప్పారు. ఈ కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ సీహెచ్ గోపీనాథ్, వీఆర్ఓలు సత్య, శ్రీనివాస్, ఆర్‌బీకే సిబ్బంది మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

తొండంగి: ఆర్‌బీకేల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసే ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయశాఖాధికారి ఎస్.నరసింహం సూచించారు. మండలంలోని తొండంగి, ఎ.కొత్తపల్లి, దానవాయిపేట, ఏవీ నగరం, రావికంపాడు, సీతారాంపురం, శృంగవృక్షం, కృష్ణాపురం, కోదాడ రైతు భరోసా కేంద్రాల్లో గురువారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో గ్రామసచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్లుకు ధాన్యం కొనుగోలు, ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈఓ కొప్పన దైవప్రసాద్, గ్రామసచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

రబీ ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు

కిర్లంపూడి: రబీ సీజన్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని మండల వ్యవసాయాధికారి జోకా అమృత తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం వీఏఏలు, ధాన్యం కొనుగోలు సిబ్బందికి శిక్షణ ఇచ్చారు.

కష్టమనిపింఛన్

- మండుటెండలో పింఛన్‌దారుల ఇక్కట్లు
- సచివాలయాల వద్ద ఎదురుచూపులు
- మళ్లీ పాతరోజులు వచ్చాయంటూ ఆందోళన



ఏలూరులో లబ్ధిదారుడికి పింఛన్ సొమ్ము అందజేస్తున్న ఎంపీడీఓ డేవిడ్ రాజ్



జగ్గంపేటలో లబ్ధిదారులకు పింఛను అందజేస్తున్న అధికారులు

తుని రూరల్: ప్రతిపక్ష నాయకులు గ్రామ వలంటీర్ల సేవలను అడ్డుకోవడంతో మండుటెండలో పింఛన్ దారులు అవస్థలు పడుతున్నారు. ప్రతినెలా ఒకటో తేదీన ఇంటి వద్దే వలంటీర్లు అందించే పింఛన్ డబ్బులు తీసుకునే వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, తదితర లబ్ధిదారులు ఇప్పుడు సచివాలయానికి వెళ్లి పింఛన్లు తీసుకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. మండలంలో 27 గ్రామ సచివాలయాల్లో బుధవారం సాయంత్రం నుంచి పింఛన్ల పంపిణీ ప్రారంభించారు. దీంతో గురువారం ఉదయం నుంచి పింఛన్ల కోసం లబ్ధిదారులకు సచివాలయాల వద్ద క్యూ కట్టారు. మండుటెండలో సైతం పింఛన్ల కోసం పడిగాపులు కాశారు. మండలంలో 12,250 మంది పింఛన్‌దారులు ఉన్నారు. వీరంతా గతంలో మాదిరిగా సచివాలయాలకు వెళ్లి పింఛన్లు తీసుకుంటున్నారు. ప్రతిపక్ష పార్టీల నాయకులు వలంటీర్లపై ఉన్న అక్కసుతో తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని అవ్వాతాతలు, దివ్యాంగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంటి వద్దకే సేవలు అందించే ప్రభుత్వం మళ్లీ రావాలని కోరుతున్నారు.

80 శాతం పింఛన్ల పంపిణీ

ప్రత్తిపాడు: వలంటీర్ల సేవలు నిలిచిపోవడంతో పింఛన్ సొమ్ము కోసం లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వృద్ధులు, వికలాంగులు మండుటెండలో సచివాలయాలకు కాలినడకన వెళ్లి పింఛన్లు తీసుకున్నారు. ప్రత్తిపాడు మండలంలోని 26 సచివాలయాల్లో గురువారం సాయంత్రానికి 80 శాతం పింఛన్ల పంపిణీ చేసినట్టు ఎంపీడీఓ ఎస్.డేవిడ్‌రాజ్ తెలిపారు. మండలంలో మొత్తం 11,771 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం రూ.3.55 కోట్ల నిధులను మంజూరు చేసింది. వీటిలో సుమారు 9,416 మంది లబ్ధిదారులకు సచివాలయ ఉద్యోగులు పింఛన్ల బట్వాడా చేశారు. మండలంలోని ప్రత్తిపాడు, ఏలూరు తదితర గ్రామాల్లో పింఛన్ల పంపిణీని ఎంపీడీఓ డేవిడ్‌రాజ్ తనిఖీ చేశారు. ఆయా గ్రామాల్లో లబ్ధిదారులకు ఆయన పింఛన్లను అందజేశారు.

జగ్గంపేట: మండల వ్యాప్తంగా అన్నిగ్రామాల్లోనూ గురువారం పింఛన్లు పంపిణీ చేశారు. మండలంలో 12366 మంది పింఛనుదారులు ఉండగా ఇప్పటివరకూ 10364 మందికి పింఛన్లు పంపిణీ చేసినట్టు ఎంపీడీఓ వసంతకుమార్ తెలిపారు. మండలంలో ప్రతినెలా పెన్షన్‌దారులకు రూ.3.66 కోట్లు పంపిణీ చేస్తుండగా గురువారం ఒక్కరోజే రూ.3.12 కోట్లు పంపిణీ చేసినట్టు వివరించారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్



నిందితుడు, స్వాధీనం చేసుకున్న గంజాయితో రైల్వే పోలీసులు

తుని: గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని స్థానిక రైల్వే స్టేషన్‌లో అరెస్ట్ చేశామని తుని జీఆర్పీ ఎస్సై ఎస్కే అబ్దుల్ మారూఫ్ తెలిపారు. రైల్వేస్టేషన్ ఒకటో నంబర్ ప్లాట్‌ఫాంపై తనిఖీలు నిర్వహిస్తుండగా విశాఖపట్నం నుంచి సికింద్రాబాద్ వెళుతున్న ఎక్స్‌ప్రెస్‌లో అనుమానాస్పదంగా కనిపించిన వ్యక్తిని పట్టుకుని ప్రశ్నించామన్నారు. బ్యాగులు తనిఖీ చేసి 18 కిలోల 390 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. దీని విలువ రూ.92 వేలు ఉంటుందన్నారు. ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లా చెల్లగడ్డకు చెందిన సంజిత్ లిమ్మాను అదుపులోకి తీసుకున్నారు. సికింద్రాబాద్‌లో గంజాయిని అమ్మకోవడానికి తీసుకువెళ్తుండగా తుని వచ్చే సరికి ఆవతల వ్యక్తి ఫోన్ స్విచ్ ఆఫ్ చేయడంతో వేరే వ్యక్తికి ఇవ్వడానికి తుని స్టేషన్‌లో దిగినట్టు నిందితుడు సంజిత్ లిమ్మా చెప్పాడన్నారు. ఆర్‌పీఎఫ్ ఏఎస్సై గోవిందరావు, జీఆర్పీ సిబ్బంది పి.శ్రీనివాసరావు, మోహనరావు, ప్రసాదరావు, రామకోటి, గణేష్, శంకర్రావుతో కలిసి నిందితుడు సంజిత్ లిమ్మాను అరెస్ట్ చేసి విజయవాడ రైల్వే కోర్టుకు తరలించామన్నారు.

చలివేంద్రం ప్రారంభం

జగ్గంపేట: గ్రామంలో అమ్మసాయి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని వైఎస్సార్ సీపీ జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పెద్దాడ రాజబాబు గురువారం ప్రారంభించారు. పాదచారులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వేసవిలో ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. చలివేంద్రం ఏర్పాటు చేసిన కొత్త శ్రీనివాసరెడ్డిని ప్రశంసించారు. కార్యక్రమంలో రిటైర్డు ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటశాస్త్రి, వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలి

జగ్గంపేట: ప్రస్తుత వేసవిలో వడదెబ్బ తగలకుండా ప్రతిఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని జగ్గంపేట సీహెచ్‌సీ డాక్టర్ ప్రణీత్ సూచించారు. స్థానిక సీహెచ్‌సీలో రోగులకు గురువారం వడగాడ్పుల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండలో తిరిగినప్పుడు మగత, వికారం, వాంతులు, కళ్లు తిరగడం వంటి లక్షణాలు ఉంటే తక్షణమే జాగ్రత్తలు పాటించాలన్నారు. నీరు, పండ్ల రసాలు, ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలన్నారు. వడదెబ్బ తగలకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో మహిళలకు పెద్దపీట

- ఆ పార్టీ ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు సతీమణి వెంకటలక్ష్మి
- ఏలేశ్వరం, అన్నవరంలో ఎన్నికల ప్రచారం



ఏలేశ్వరంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న వరుపుల వెంకటలక్ష్మి

ఏలేశ్వరం/అన్నవరం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేసిందని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు సతీమణి వెంకటలక్ష్మి అన్నారు. ఏలేశ్వరం పట్టణం, అన్నవరంలో గురువారం ఆమె ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు వాగు బలరామ్ ఇంటి నుంచి ఎన్నికల ప్రచారం చేపట్టారు. పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిలో మహిళల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. వచ్చే ఎన్నికల్లో మహిళలు అందరూ వైఎస్సార్ సీపీకి అండగా నిలవాలని కోరారు. కార్యక్రజుమంలో పార్టీ నాయకులు వరుపుల సూరిబాబు, వరుపుల రాజబాబు, శిడగం వెంకటేశ్వరరావు, వాగు బలరామ్, సామంతుల సూర్యకుమార్, అన్నవరం సర్పంచ్ శెట్టిబత్తుల కుమారరాజా, తొండారపు రాంబాబు, దోశ కిషోర్, పైల విజయ్‌కుమార్, ఎస్.రాంబాబు పాల్గొన్నారు.

రహదారి నిర్మాణ పనుల పరిశీలన

శంఖవరం: మండలంలోని శంఖవరం–వేళంగి రోడ్డు నిర్మాణ పనులను గురువారం ఎంపీపీ పర్వత రాజబాబు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటీడీఏ నిధులతో సుమారు 19 కిలోమీటర్ల మేర రహదారి నిర్మాణ పనులు చేపట్టినట్టు తెలిపారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. వైఎస్సార్ సీపీ నాయకులు పర్వత వివేక్, పడాల దొంగబాబు, రేలంగి సూరిబాబు, గుండు చెంచుబాబు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు అంగ వైకల్యం నిర్ధారణ పరీక్షలు




శిబిరంలో మాట్లాడుతున జిల్లా కో ఆర్డినేటర్ చామంతి నాగేశ్వరరావు

తుని: స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో గురువారం అంగ వైకల్యం నిర్ధారణ శిబిరం నిర్వహించారు. సమగ్ర శిక్షా అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ పి.రమేష్ ఆదేశాల మేరకు ఈ శిబిరం ఏర్పాటు చేసినట్టు ఎంఈవో పరవాడ గీతాదేవి తెలిపారు. శిబిరానికి తుని, తొండంగి, కోటనందూరు, రౌతులపూడి, శంఖవరం మండలాలకు చెందిన 1 నుంచి 12వ తరగతి చదువుతున్న విద్యార్థులు హాజరయ్యారు. ముఖ్య అతిథిగా హాజరైన సమగ్ర శిక్షా అభియాన్ జిల్లా కో ఆర్డినేటర్ చామంతి నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల కోసం శిబిరం ఏర్పాటు చేశామన్నారు. నిపుణులైన వైద్యులతో వైద్య పరీక్షలు నిర్వహించి జాబితాను రాష్ట్ర కార్యాలయానికి పంపుతామన్నారు. ఎంపిక చేసిన పిల్లలకు నిపుణులైన ఉపాధ్యాయులతో శిక్షణ ఇప్పిస్తామన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రభుత్వ వైద్యులు మహేశ్వరరావు (ఆర్థోపెడిక్), ఎస్.దీప్తి సైకియాట్రిస్ట్ (ఆప్తమాలజిస్ట్), కె.లావణ్య(ఈఎన్‌టీ), ఎంఈవోలు ఎ.రామకృష్ణ, శ్రీనివాస్, రాంబాబు, పాఠశాల హెచ్‌ఎం ఎం.నూకరత్నం, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

మూకుమ్మడిగా వలంటీర్ల రాజీనామాలు



ఎస్.అన్నవరంలో కార్యదర్శి మధుశేఖర్‌కు రాజీనామా పత్రాలు అందజేస్తున్న వలంటీర్లు



బెండపూడిలో కార్యదర్శి రాజబాబుకు రాజీనామా పత్రాలను అందిస్తున్న వలంటీర్లు

తుని రూరల్: గ్రామ వలంటీర్ల సేవలపై అసత్య ఆరోపణలు చేస్తున్న టీడీపీ నేతలు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి పింఛన్ల పంపిణీని అడ్డుకోవడంతో మనస్థాపానికి గురైన వలంటీర్లు స్వచ్ఛందంగా రాజీనామాలు చేశారు. మండలంలో మేజరు పంచాయతీ ఎస్.అన్నవరంలో గ్రామ వలంటీర్లు గురువారం మూకుమ్మడిగా రాజీనామా చేశారు. ఈ మేరకు పంచాయతీ కార్యదర్శి మధుశేఖర్‌కు రాజీనామా పత్రాలను అందజేశారు. అలాగే తేటగుంట, కేఓ. మల్లవరం, డి.పోలవరం, చేపూరు, తాళ్లూరు తదితర గ్రామాలకు చెందిన వలంటీర్లు సైతం రాజీనామా చేశారు. ఆయా పంచాయతీ కార్యదర్శులకు రాజీనామా పత్రాలను అందజేశారు.

23 మంది గ్రామ వలంటీర్ల రాజీనామా

తొండంగి: గ్రామ వలంటీర్ల సేవలపై ఈసీకి ప్రతిపక్షాలు ఫిర్యాదు చేయడంతో గ్రామ వలంటీర్లను పింఛన్లు పంపిణీ చేయవద్దని ఈసీ ఆదేశాలు జారీ చేసింది. దీంతో మనస్థాపానికి గురైన వలంటీర్లు రాజీనామాల బాట పట్టారు. దానవాయిపేట, ఎ.కొత్తపల్లి పంచాయతీల పరిధిలో ఇప్పటికే 55 మంది వలంటీర్లు మూకుమ్మడిగా రాజీనామా చేసిన విషయం విదితమే. కాగా గురువారం బెండపూడి పంచాయతీలోని రెండు సచివాలయాల పరిధిలో 23 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శి రాజబాబుకు అందజేశారు.